క్లుప్తంగా

గుర్తింపు కార్డులివ్వడం హర్షణీయం



తహసీల్దారును సన్మానిస్తున్న కళాకారులు

పరిగి: కళాకారులకు ఐడెంటిటీ కార్డుల మంజూరులో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పాత్ర మరువలేమని గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాకారుల సంఘం అధ్యక్షుడు రామలింగప్ప అన్నారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీపీ సవిత భర్త, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, పరిగి సర్పంచ్ లక్ష్మీదేవి భర్త శివశంకర్‌ను కళాకారుల ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అడిగిన వెంటనే గుర్తింపు కార్డులు వచ్చేలా కృషి చేశారని కొనియాడారు.

ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా

హిందూపురం అర్బన్: ఇటీవలి కాలంలో పట్టణంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని పట్టణ సీఐ వీ.శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ర్యాష్ డ్రైవింగ్ చేసినా, వాహన, డ్రైవింగ్ లైసెన్సు లేకపోయినా, చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చినా, వారు రోడ్డుపై వాహనాల్లో డ్రైవ్ చేస్తూ కనపడినా కేసులు నమోదు చేస్తామన్నారు. గురువారం నుంచి మరింత కట్టుదిట్టంగా ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తామన్నారు.

ఆర్టీసీ ఎండీకి స్వాగతం పలికిన ఎస్పీ



హిందూపురం అర్బన్: చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టులోని రక్షా అకాడమీలో బుధవారం రాత్రి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావునుఎస్పీ మాధవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎండీ రాత్రికి అక్కడే బసచేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యేను కలసిన కురుబ సంఘం నాయకులు

పెనుకొండ: ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను రాష్ట్ర కురుబ సంఘం నాయకులు కలసి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడిగా బోరంపల్లి ఆంజనేయులు, యువజన సంఘం అధ్యక్షుడిగా బుల్లెలింగప్రసాద్‌లు ఇటీవల నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో వారు కురుబ సంఘం నాయకులతో కలసి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు.

వైఎస్సార్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

పట్టణంలోని దర్గా సర్కిల్లో మహానేత వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని ఎమ్మెల్యే శంకరనారాయణ పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. గతంలో ఇక్కడున్న వైఎస్సార్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలగించారు. ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తవడంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు.

వ్యక్తిపై కేసు నమోదు

హిందూపురం అర్బన్: హిందూపురం పరిధిలోని సింగిరెడ్డిపల్లి క్రాస్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ సువర్ణలత తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి



అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్

హిందూపురం టౌన్: హిందూపురం నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాల ప్రదేశాల మార్పులు, పేర్ల మార్పుకు అన్ని రాజకీయ పార్టీలు సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పోలింగ్ కేంద్రాల మార్పు ప్రక్రియ ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పవర్ ఫుల్ !

సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విద్యుత్ వ్యవస్థలో ఉన్న లోపాలు సరిదిద్దుకొంటూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పదిరోజుల్లో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రారంభించనున్నారు. మరో రెండు మంజూరు అయ్యాయి. మరో ఐదింటికి ప్రతిపాదనలకూ కూడా పంపారు. మొత్తంగా వ్యవసాయంతో పాటు పరిశ్రమలకు, గృహ వినియోగదారులకు కూడా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

- త్వరలో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభం
- మరో రెండు మంజూరు, ఐదింటికి ప్రతిపాదనలు
- నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు
- వ్యవసాయం, పరిశ్రమలతో పాటు గృహ వినియోగదారులకూ ప్రయోజనం

విద్యుత్ సబ్‌డివిజన్ : హిందూపురం	
డివిజన్‌లోని మండలాలు	12
220 కేవీ సబ్‌స్టేషన్లు	4
132 కేవీ సబ్‌స్టేషన్లు	6
33/11 కేవీ సబ్‌స్టేషన్లు	49
గృహ విద్యుత్ కనెక్షన్లు	1,98,574
వ్యవసాయ కనెక్షన్లు	42,282
కమర్షియల్ కనెక్షన్లు	19,662
పరిశ్రమల కనెక్షన్లు	242
రోజుకు విద్యుత్ వినియోగం	63 లక్షల యూనిట్లు

హిందూపురం అర్బన్: హిందూపురం పట్టణంతో పాటు సబ్ డివిజన్‌లోని 12 మండలాల్లోని గ్రామాలకు నిరంతర విద్యుత్ అందుతోంది. ఏదైనా సాంకేతిక లోపం తలెత్తినా, అంతరాయాలు ఏర్పడినా విద్యుత్ సిబ్బంది, కార్మికులు వెంటనే మరమ్మతు చేసి విద్యుత్ అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో రాత్రి, పగలు నిరంతర విద్యుత్ అందుతోంది.

వ్యవసాయానికి 9 గంటలు


సబ్ డివిజనల్‌లో 42 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అగళి, రొళ్ల మండలాలు మినహా మిగిలిన అన్ని చోట్లా రోజూ 9 గంటలు విద్యుత్ అందిస్తున్నారు. మరో నెల రోజుల్లో అక్కడ కూడా రెండు నూతన సబ్‌స్టేషన్లు వినియోగంలోకి రానున్నాయి. అప్పుడు అక్కడ కూడా అంతరాయం లేని విద్యుత్ అందనుంది. ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తుండటంతో విద్యుత్ సరఫరాకు ఏ ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

పదిరోజుల్లో మూడు సబ్‌స్టేషన్లు

కల్లూరు, రంగేనహళ్లి, చెర్లోపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు చివరిదశకు చేరాయి. పదిరోజుల్లోపే వీటిని ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇవి ప్రారంభమైన తర్వాత రైతులకు అవసరమైన నూతన కనెక్షన్లకు కూడా ఇబ్బంది ఉండదంటున్నారు.

మరో ఐదింటికి ప్రతిపాదనలు

గుడ్డికుర్కి, వైబీ హళ్లి, రెడ్డిపల్లి, పైడేటి, బక్సంపల్లిలో కూడా నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.



తూమకుంట పారిశ్రామికవాడ

పారిశ్రామికవాడకు ఇబ్బంది లేకుండా...

తూమకుంట, గోళ్లాపురంలో 242 పరిశ్రమలు ఉన్నాయి. వాటికి నిత్యం 43 లక్షల యూనిట్ల విద్యుత్ అవసరం. అందుకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేవలం పరిశ్రమల నుంచే నెలకు రూ.110 కోట్లు విద్యుత్ సంస్థకు వస్తోంది. ప్రస్తుతం రోజూ సాయంత్రం 5–7 (రెండు గంటలు) పరిశ్రమలకు కోత విధిస్తున్నారు. కిరికెర, గోళ్లాపురంలలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. అవి పూర్తయితే పరిశ్రమలకు నిరంతర విద్యుత్ అందించే వీలుంది. తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామిక వాడల్లోని వివిధ పరిశ్రమల్లో 20 వేల మంది ఉద్యోగులు, కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

అన్నీ ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్సే..



కొత్త సబ్‌స్టేషన్లతో ఎన్నో ప్రయోజనాలు సమకూరనున్నాయి. లోఓల్టేజి సమస్య, అంతరాయాలు లేని విద్యుత్ అందించేందుకు వీలుంటుంది. నూతన కనెక్షన్స్ ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. విపత్తుల కారణంగా ఏదైనా సమస్య తలెత్తినా తక్షణం మరమ్మతు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పుడు ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్స్ రానున్నాయి.
– భూపతి, విద్యుత్‌శాఖ ఈఈ హిందూపురం



బోరుబావి కింద సాగులో ఉన్న మల్బరీ పంట

లెక్కతో కేసు మాఫీ !

రొళ్ల: మండలంలోని కాకి సచివాలయం పరిధిలోని మొబైల్ ద్వారా ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న నలుగురిని పోలీసులు సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. అయితే వారిపై కేసు నమోదు చేయకుండా స్థానిక నాయకులతో కలిసి పంచాయితీ చేసినట్లు తెలిసింది. రూ.40 వేలు డిమాండ్ చేసి ఆఖరికి రూ.34 వేలకు ఒప్పందం కుదుర్చుకొని రూ.33,500 నగదును స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ద్వారా అందజేసినట్లు సమాచారం. దీంతో కేసు లేకుండా ఆ నలుగురిని విడిచిపెట్టారన్న వార్త ఇప్పుడు మండలంలో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఈ వ్యవహారంపై ఎస్ఐ మధురామచంద్రుడును వివరణ కోరగా కాకి పంచాయతీలో నలుగురు ఫోన్‌లో మట్కా కార్యకలాపాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో వారిని స్టేషన్‌కు పిలిపించి మందలించామన్నారు. అయితే డబ్బులు ఇచ్చినట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు.

ఆరోపణలు వచ్చిన కానిస్టేబుల్‌పై ఎస్పీ ఆరా

సోమందేపల్లి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓ ఐడీ పార్టీ హెడ్‌కానిస్టేబుల్‌పై వచ్చిన ఆరోపణలపై ఎస్పీ మాధవ్‌రెడ్డి ఆరా తీశారు. కొద్దిరోజుల క్రితం చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద సోమందేపల్లి మండలానికి చెందిన వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. అయితే కేసు లేకుండా చేయడానికి నిందితుడి నుంచి ఐడీ పార్టీ కానిస్టేబుల్ రూ.1 లక్షల నగదు వసూలు చేసినట్లు ఎస్పీకి ఫిర్యాదులు వెళ్లాయి. అలాగే బాధితుడి నుంచి చిలమత్తూరు స్టేషన్‌కు చెందిన మరో కానిస్టేబుల్ బంగారు బ్రాస్‌లేట్ లాక్కున్నట్లు బాధితుడు చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో ఎస్పీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటికే సదరు కానిస్టేబుల్ పలు కేసుల్లో తలదూర్చి అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

చిలమత్తూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. రహదారులపై వేగనియంత్రణలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తామన్నారు. స్టేషన్ ఆవరణ బాగుందని, స్టేషన్ లోపల సౌకర్యాలు మరింత మెరుగుపర్చుకోవాలని ఎస్ఐ గంగాధర్‌కు సూచించారు.

హమాలీ యూనియన్ ఏర్పాటు

సోమందేపల్లి: మండల కేంద్రంలో బుధవారం హమాలీ యూనియన్ ఏర్పాటు చేసినట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య తెలిపారు. అధ్యక్షుడిగా కిష్టప్ప, ఉపాధ్యక్షుడిగా కదిరప్ప, సభ్యులుగా హనుమంతు, బాషా, అంజినేయులను ఎన్నుకున్నట్లు చెప్పారు.

గొర్రెల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

మడకశిర: గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణంలో బుధవారం గొర్రెల పెంపకం దారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ప్రాంతీయ వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అమర్ అధ్యక్షత వహించారు. హిందూపురం డివిజన్ పశువర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంచలయ్య ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గొర్రెల పెంపకందారులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని , తద్వారా అధిక లాభాలు పొందాలని కోరారు. గొర్రెల మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేలు ఉండే విధంగా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక అసిస్టెంట్ డైరెక్టర్ అమర్ గొర్రెల కొచ్చే వ్యాధుల గురించి వివరించారు. హిందూపురం డివిజన్ పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ గొర్రెల పెంపకం దారులు సలహాలు సూచనలు పాటించి అధిక లాభాలు గడించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని గొర్రెల పెంపకందారులు, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న దృశ్యం

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న వేణురెడ్డి



బాధితులను పరామర్శిస్తున్న చౌళూరు మధుమతిరెడ్డి

హిందూపురం: పూలకుంట గ్రామంలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన గ్రామ వలంటీర్ అరుణ, గృహసారథి రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు చాకలి నరసింహప్ప, చాకలి రాజశేఖర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. గుడ్డంపల్లి వేణురెడ్డి, చౌళూరు మధుమతి రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంతేబిదనూరు రాము, ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, నాయకులు నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, తిప్పే రుద్రయ్య, చాంద్‌బాషా, మహిళా అధ్యక్షురాలు నాగమణి, జేఏఎస్ కన్వీనర్ గిరి, మోహన్ తదితరులు బుధవారం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఒక కులాన్ని కించపరుస్తూ టీడీపీ నాయకులు ఇలా దాడులు చేయడం చాలా సిగ్గుచేటు వారు విమర్శించారు. బాధితులకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అధికారులను కోరారు.

సందడిగా అ'పూర్వ' సమ్మేళనం



40 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గోరంట్ల: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో (అప్పటి ఉమ్మడి బాల బాలికల ఉన్నత పాఠశాలలో) 40 ఏళ్ల క్రితం (1982–1983) పదోతరగతి చదువుకొన్న విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా పాఠశాలలో సరస్వతీ, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం నాటి గురువు సమక్షంలో ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్నేహితులంతా నాటి తీపి గుర్తులను నెమరవేసుకున్నారు. నాటి గురువులు కుళ్లయప్ప, మహ్మద్ అలీ, గోపినాథ్, రఘురామిరెడ్డి, ఓబిరెడ్డి, రామచంద్రారెడ్డి, సుబ్రమణ్యం, తదితరులను సన్మానించారు.

ప్రజలకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష



గోరంట్ల: మాట్లాడుతున్న డీపీఓ విజయకుమార్‌రెడ్డి



హిందూపురం: 8వ వార్డులో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు



అమరాపురం మండలం గుణేహళ్లిలో ప్రజలకు వైద్య చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు

సాక్షిబృందం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలందరికీ వరం లాంటిది. ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి' అని జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని నార్శింపల్లి సచివాలయ ప్రాంగణంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. మరోవైపు హిందూపురంలోని 8వ వార్డు, పరిగి మండలం ఎర్రగుంట, రొద్దం మండలం కంబాలపల్లి, మడకశిర మండలం చందకచెర్లు, అగళి మండలం మధుడి, అమరాపురం మండలం గుహేహళ్లి, గుడిబండ మండలం తాళికెర గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు.

దేవీ వైభవం

సాక్షిబృందం: శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని అన్ని అమ్మవారి ఆలయాల్లోనూ ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లు వివిధ అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు.



పావగడ: రాజరాజేశ్వరిగా దుర్గాదేవి



హిందూపురం: నృసింహుని అలంకరణలో గంగమ్మ



పరిగి: నవధాన్యాల అలంకరణలో కాళికామాత



చిలమత్తూరు: మహాలక్ష్మిగా చౌడేశ్వరీదేవి



హిందూపురం: శక్తిమురగన్‌గా వాసవీమాత



పెనుకొండ: లక్ష్మీదేవి అలంకరణలో మహేశ్వరి



రొళ్ల: ధనలక్ష్మిగా కొల్హాపురి మహాలక్ష్మి



అమరాపురం: అలంకరణలో శ్రీదేవి



లేపాక్షి: లలితాదేవిగా దుర్గాదేవి

సంక్షిప్త సమాచారం

రేపు మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రైవేట్ స్థలాల్లోకి డ్రైనేజీ నీళ్లు వెళ్లకుండా చర్యలు

హిందూపురం అర్బన్: మండలంలోని తూమకుంట ఎస్సీ కాలనీ నుంచి వెళ్తున్న మురుగు కాలువ నీరు తమ పొలాల్లోకి వస్తున్నాయంటూ ఆ ప్రాంత పొలాలకు చెందిన రైతులు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో డీపీఓ విజయ్‌కుమార్ బుధవారం నేరుగా తూమకుంటకు పరిశీలనకు వచ్చారు. వెంటనే మురుగు నీరు ప్రైవేటు పొలాల్లోకి వెళ్లకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్పను ఆదేశించారు.

విష జ్వరాలపై అవగాహన

అమరాపురం: మండలంలోని హనుమంతనపల్లిలో బుధవారం డాక్టర్ భార్గవ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం పాతన్న కుమారుడు కృషికుమార్ మృతి చెందడంతో స్పందించిన అధికారులు ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై పరీక్షలు నిర్వహించారు. మరుగు నీటి కాలువలో అబేట్ మందును పిచికారీ చేయించారు